సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 12 । డిసెంబర్ । 2024



వణుకుతున్న మన్యం

చింతపల్లి: మన్యంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. దట్టంగా మంచు కురవడంతోపాటు చలిగాలులు విజృంభిస్తున్నాయి. శీతల గాలుల ప్రభావమే ఇందుకు కారణమని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్‌లో బుధవారం జి. మాడుగులలో 11.6, జీకేవీధిలో 13.2, చింతపల్లి, డుంబ్రిగుడ, పెదబయలు ప్రాంతాల్లో 13.8, పాడేరు, హుకుంపేటలో 14.1, ముంచంగిపుట్టులో 14.6, అరకులోయలో 14.8, అనంతగిరిలో 15.5, కొయ్యూరులో 18.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయన్నారు.

న్యూస్‌రీల్

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ

- పాడేరులో రైతులతో ర్యాలీ రేపు
- నేతలు, రైతులు తరలిరావాలి
- పార్టీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పిలుపు



సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 13వతేదీన జిల్లా కేంద్రం పాడేరులో అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించాలనే నినాదంతో రైతులతో పాడేరు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు. ఈ మేరకు జిల్లాలోని ఎంపీ, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ పార్టీ పదవుల్లో ఉన్న నాయకులు, పార్టీ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

14న సాగునీటి సంఘాలకు ఎన్నికలు

- కలెక్టర్ దినేష్‌కుమార్



సాక్షి,పాడేరు: జిల్లాలోని సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జి.కే.వీధి, కొయ్యూరు, రంపచోడవరం, దేవిపట్నం, గంగవరం, రాజవొమ్మంగి, వై.రామవరం, మారేడుమిల్లి, అడ్డతీగల మండలాల్లో 84 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఆదే రోజు సర్వసభ్య మండలి సమావేశం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. నిర్దేశించిన గ్రామాల్లో నిర్వహిస్తున్న సమావేశాల వేదిక వద్దకు సాగునీటి సంఘాల పరిధిలోని భూముల యాజమానులు శనివారం ఉదయం 8 గంటలకు చేరుకోవాలని సూచించారు. ముందుగా ప్రాదేశిక నియోజక వర్గం సభ్యులను ఎన్నుకుంటారని, అనంతరం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నిక జరుగుతుందన్నారు. సాగునీటి సంఘంలో ఓటు హక్కు కలిగిన భూయాజమానులంతా ఉదయం జరిగే సర్వ సభ్య సమావేశంలో తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు : సౌదీ అరేబియాలో నర్సింగ్ ఉద్యోగాలకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, యూసఫ్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. రోహిణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి అయి ఉండి 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.78 వేల నుంచి రూ.89 వేలు, మెడికల్ ఇన్సూరెన్స్, ఇతర అలవెన్సులు చెల్లిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9988853335, 9949927899ను సంప్రదించాలని ఆమె కోరారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం



మెట్టవీధి సమీపంలో ఇరువైపులా అసంపూర్తిగా మినీ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు

- మెట్టవీధి సమీపంలో పూర్తికాని మినీ బ్రిడ్జి నిర్మాణం
- ఇరువైపులా అప్రోచ్‌రోడ్ల ఏర్పాటులో జాప్యం
- వర్షం పడినప్పుడల్లా డైవర్షన్ మార్గంలో కూరుకుపోతున్న వాహనాలు
- ఏవోబీలో అందుబాటులోకి రాని జామిగుడ రోడ్డు
- కేంద్ర ప్రభుత్వం రూ.13 కోట్లు వెచ్చించినా కానరాని ప్రయోజనం
- రవాణా సమస్యను ఎదుర్కొంటున్న ఇరు రాష్ట్రాల సరిహద్దు గిరిజనులు

కేవలం ఓ మినీ బ్రిడ్జికి అప్రోచ్‌లు నిర్మించడంలో జాప్యం వల్ల ఏవోబీలో ఇరురాష్ట్రాల సరిహద్దు గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కీలకమైన జామిగుడ రోడ్డు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించింది. ఈ మార్గంలో దాదాపుగా పనులన్నీ పూర్తయ్యాయి. నిధులున్నా మెట్టవీధి వద్ద మినీ బ్రిడ్జికి అప్రోచ్‌లు నిర్మించడంలో జాప్యం జరుగుతోంది. వర్షం కురిసినప్పుడల్లా ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆయా ప్రాంతాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డైవర్షన్ రోడ్డులో కూరుకుపోయిన వాహనం

సాక్షి,పాడేరు: ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల్లోని కీలకమైన జామిగుడ రోడ్డు అందుబాటులోకి రాకపోవడంతో ఒడిశా రాష్ట్రంలోని సరిహద్దు గ్రామాలకు వెళ్లేందుకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈమార్గం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.13 కోట్లతో పలు చోట్ల గెడ్డలపై వంతెనలు, తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. పెదబయలు మండలం జామిగుడ పంచాయతీ మెట్టవీధి సమీపంలో మినీ బ్రిడ్జి మినహా మిగతా నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. ఇక్కడ సుమారు రూ.30 లక్షలతో చేపట్టిన వంతెనకు రెండు వైపులా అప్రోచ్‌రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ పనుల్లో జాప్యం వల్ల ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వర్షం పడినప్పుడల్లా డైవర్షన్ రోడ్డు బురదమయంగా మారుతోంది. దీనివల్ల ఆంధ్రాలోని జామిగుడ పంచాయతీ పరిధి మెట్టవీధి, మరో మూడు గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. పాడేరు నుంచి సీలేరు, ధారకొండ వెళ్లేందుకు ఈ మార్గం దగ్గరిదారి. చింతపల్లి నుంచి జీకేవీధి మీదుగా తెలంగాణ, చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే అంతర్‌రాష్ట్ర రహదారి గత సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు దెబ్బతింది. దీంతో ఆయా మార్గాల్లో వెళ్లేవారు కూడా జామిగుడ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం కురిసినప్పుడల్లా డైవర్షన్ మార్గంలో వాహనాలు కూరుకుపోతున్నందున రాకపోకలు నిలిచిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు ఈ దుస్థితి అని సరిహద్దు గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు నరకమే



మినీ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ అప్రోచ్‌రోడ్డు నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలకు డైవర్షన్ రోడ్డు బురదగా మారుతోంది. వాహనాలు కూరుకుపోతున్నాయి. మేమంతా అక్కడికి వెళ్లి బయటకు తీయాల్సిన పరిస్థితి. మినీ బ్రిడ్జి నిర్మాణానికి అప్రోచ్ రోడ్లు నిర్మిస్తే రాకపోకల ఇబ్బందులు తప్పుతాయి.

– సత్యారావు, మెట్టవీధి, జామిగుడ పంచాయతీ, పెదబయలు మండలం

పది రోజుల్లో పూర్తిచేస్తాం

వర్షాల కారణంగా వంతెన పనులకు అవరోధం ఏర్పడింది. గతంలో వర్షాలకు కొంత మట్టి కూడా కొట్టుకుపోయింది. మినీ బ్రిడ్జికి రెండువైపులా అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించిన వెంటనే యుద్ధప్రాతిపదికన పనులు చేపడతాం. సుమారు పది రోజుల్లో మినీ బిడ్జిని అందుబాటులోకి తెస్తాం.

– రవికుమార్, డీఈఈ (ప్రాజెక్ట్స్), పంచాయతీరాజ్, పాడేరు

పింఛన్ల సర్వేపై దుమారం

- పింఛన్లు తొలగిస్తారన్న భయం ఉందన్న జెడ్పీటీసీలు
- ప్రొటోకాల్ పాటించడం లేదని సభ్యుల ఆవేదన



మాట్లాడుతున్న జెడ్పీ చైరపర్సన్ జె.సుభద్ర, చిత్రంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

మహారాణిపేట: సామాజిక పింఛన్ల సర్వేపై జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశంలో దుమారం చేలరేగింది. బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. పింఛన్ల సర్వేపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోందని.. పింఛన్లు తొలగిస్తారన్న భయం నెలకొందని.. దీనిపై అపోహాలు నివృత్తి చేయాలని దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం కోరారు. దీనిపై జెడ్పీ చైరపర్సన్ జె.సుభద్ర వివరణ కోరగా.. విశాఖ జిల్లా డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్లపై సర్వే జరుగుతోందన్నారు. పింఛన్లు తొలగించమని ఆదేశాలు జారీ లేవని, సర్వే నివేదిక కూడా ప్రభుత్వానికి పంపామన్నారు.

ప్రొటోకాల్‌పై రగడ

ప్రొటోకాల్‌పై కొంత మంది జెడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో జరిగే కార్యక్రమాలకు జెడ్పీటీసీ సభ్యులకు ఆహ్వానాలు ఉండడం లేదని, శిలాఫలకాలపై పేర్లు వేయడం లేదని వాపోయారు. మునగపాక జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట సామ సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల తమ మండలంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలకు జరిగాయని, తనను ఆహ్వానించలేదన్నారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో నిబంధనలు పాటించడం లేదని, అర్హత గల వారికి ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. కె.కోటపాడు మండలంలో ఇటీవల జరిగిన కార్యక్రమాలకు తమకు ఎలాంటి ఆహ్వానం లేదని జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ అన్నారు.

సదరం జాప్యంపై ఆందోళన

సదరం సర్టిఫికెట్లు అర్హులకు అందడం లేదని, స్లాట్‌ల కోసం దివ్యాంగులు పలుమార్లు తిరగాల్సి వస్తోందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సదరం స్లాట్‌లు దొరకకపోవడంతో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యులు ఈర్లె అనురాధ, పెంటకోట సామ సత్యనారాయణ అన్నారు. సదరం మెగా క్యాంప్ నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు.

తీర్మానం

ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కార్యక్రమాలు, సమావేశాలకు స్థానిక జెడ్పీటీసీ, ఎంపీటీసీలను ఆహ్వానించాలని జిల్లా పరిషత్‌లో ఒక తీర్మానం చేయనున్నట్టు జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర తెలిపారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వానికి కూడా పంపనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో డీప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పరిస్థితి దారుణం

జిల్లాలోని పలు పాఠశాలల్లో మరుగుదొడ్ల దుస్థితి దారుణంగా ఉందని జెడ్పీ చైరపర్సన్ జె.సుభద్ర, ఇతర సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పర్యటన సమయంలో పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశీలించాలని ఆదేశించారు.

రాత్రులు వైద్యులు ఎక్కడ?

ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో రాత్రుల సమయంలో వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ఆస్పత్రుల్లో డ్యూటీ సమయంలో కూడా వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, దీంతో రోగులను కేజీహెచ్‌కు తరలించాల్సి వస్తోందని కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అన్నారు.

అందుబాటులో లేని 108 సేవలు

గతంలో ఫోన్ చేస్తే 108 వాహనాలు వచ్చేవని, ఇప్పుడు ఫోన్ చేసినా వచ్చే పరిస్థితి ఉండడం లేదని.. వాహనాలు ఏమైనా తగ్గించారా అని పలువురు సభ్యులు ప్రశ్నించారు. అనంతగిరిలో రోగులను 108 వాహనంలో ఎస్.కోటకు తరలిస్తున్నారని, దీని వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారని జెడ్పీటీసీ గంగరాజు అన్నారు.

గిరిజన విద్యార్థినులను వేధిస్తే ఉపేక్షించం

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు హెచ్చరిక
- ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల తనిఖీ



తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : చదువుకుంటున్న గిరిజన విద్యార్థినులను వేధించడమే కాకుండా ఇబ్బందులకు గురి చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. పట్టణంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వీటిపై అక్కడి నుంచి సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఏడవ తగగతి చదువుతున్న గిరిజన విద్యార్థినిపై పాఠశాల ల్యాబ్ అసిస్టెంట్ అఘాయిత్యానికి పాల్పడటం అత్యంత హేయమైన చర్య అన్నారు. పాఠశాలలో ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంల పర్యవేక్షణ కొరవడటంతోనే తరచుగా ఏదొక సంఘటన జరుగుతోందన్నారు. గిరిజన విద్యా సంస్థల్లో సహాయ గిరిజన సంక్షేమశాఖాధికారులు నిత్యం పర్యవేక్షణ జరపాలన్నారు. విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. భవిష్యత్ లక్ష్యాన్ని ప్రాథమిక దశలోనే నిర్ణయించుకొని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను, ఆశయాలను గుర్తెరిగి చదువుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా తమ దృష్టికి తేవాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, సీనియర్ నాయకులు కూడా సుబ్రమణ్యం ఉన్నారు.

వలిసెల సాగు అభివృద్ధికి చర్యలు

- ఏఐసీఆర్‌పీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఆనంద్ విశ్వకర్మ



చింతపల్లిలో వలిసెల పంటను పరిశీలిస్తున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఆనంద్ విశ్వకర్మ, ఏడీఆర్ అప్పలస్వామి

చింతపల్లి: జిల్లాలో ప్రత్యేకమైన వలిసెల సాగు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఇందుకోసం ప్రత్యేక ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని ఏఐసీఆర్‌పీ జబల్‌పూర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఆనంద్ విశ్వకర్మ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సందర్శించారు. ఇక్కడ పరిశోధన క్షేత్రంలో వలిసెల పంటపై జరుగుతున్న పరిశోధనలను ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి నుంచి తెలుసుకున్నారు. చింతపల్లి కేంద్రంగా కేజీఎన్-2 రకం ప్రస్తుతం వినియోగంలో ఉందన్నారు. అధిక దిగుబడిని ఇచ్చే జబల్‌పూర్ 28, జబల్‌పూర్ 30 రకాలను మన్యానికి పరిచయం చేస్తున్నామన్నారు. త్వరలో చింతపల్లి-1, చింతపల్లి-2 రకాలను అధికారికంగా విడుద చేయాల్సి ఉందన్నారు. చివరి దశ ఫలితాలు విడుదల కావాల్సి ఉందన్నారు. దేశవ్యాప్తంగా నూనెగింజల పంటలకు మంచి గిరాకీ ఉన్నందున పొద్దుతిరుగుడు, ఆవాలు, లిన్సిడ్, వేరుశనగ, నువ్వులు, వలిసెల సాగును ప్రోత్సహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపురెడ్డి, డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి, సందీప్‌నాయక్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటన దోషులను కఠినంగా శిక్షించాలి

- కూటమి ప్రభుత్వంలో బాలికలు, మహిళలకు రక్షణ కరువు
- వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు శాంతికుమారి స్పష్టం


మాట్లాడుతున్న శాంతికుమారి

డుంబ్రిగుడ: పాడేరు ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనకు పాల్పడిన ల్యాబ్ అటెండర్ అనుజ్‌సింగ్ పటేల్‌పై ఒక్క పోక్సో కేసుతో పాటు దిశా చట్టంతో పాటు నిందితుడికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు బంగురు శాంతికుమారి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌తో సహా బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దిశ చట్టం ద్వారా మహిళలు, బాలికలకు ఎంతో రక్షణ కలిగిందని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల రక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో బాలికలు, మహిళలకు రక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఘాయిత్యాలు, అత్యాచార, హత్యాచార ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పాడేరు ఏకలవ్య పాఠశాల విద్యార్థిని అత్యాచార ఘటనపై దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో దాడి చేశారని ఫిర్యాదు


సీసీ ఫుటేజ్‌లో వైద్య సిబ్బందిపై దాడి చేస్తున్న ప్రవీణ్‌కుమార్ చిత్రం

మారేడుమిల్లి: మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న తనపై దాడి పాల్పడ్డారని లక్కొండ ప్రభావతి అనే వైద్య ఉద్యోగిణి స్థానిక పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం 4.25 సమయంలో పత్రి ప్రమీల అనే మహిళ వైద్య కోసం తన భర్త పత్రి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి వచ్చారన్నారు. మహిళ పేషెంట్‌కు యాంటీనటల్ స్కానింగ్ గురించి వైద్య సిబ్బంది వివరిస్తుండగా తాను మొబైల్‌లో ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజింగ్ అటెండెన్స్ సిస్టమ్) నమోదు చేస్తుండగా, రోగికి వీడియో తీస్తున్నట్టు భావించి, ప్రవీణ్‌కుమార్ దాడికి పాల్పడ్డారని తెలిపారు. తనపై, వైద్య సిబ్బందిపై దుర్భాషలాడారని, తనను తీవ్రంగా కొట్టి, తోసివేయడంతో కిందపడగా తలకు గాయమైనట్టు వైద్య ఉద్యోగి ప్రభావతి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ గొడవకు సంబంధించిన వీడియోను ఫిర్యాదులో జత చేసినట్టు తెలిపారు.

కారు దగ్ధంపై వీడిన మిస్టరీ

- కలప తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ఘటన


అటవీప్రాంతంలో దగ్ధమైన కారు

చింతూరు: చట్టి, భద్రాచలం జాతీయ రహదారిలో సరివెల వద్ద అటవీప్రాంతంలో బుధవారం కారు దగ్ధమైన ఘటనలో మిస్టరీ వీడింది. కారులో కలప తరలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కారు దగ్ధమైనట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. తొలుత మావోయిస్టుల చర్యగా అనుమానించినా కారుకు సంబంధించిన ఇంజిన్, ఛాసిస్ నెంబర్ల ఆధారంగా కారు ఎవరిదనే విషయంపై పోలీసులు ఆరా తీయగా ఈ విషయం బహిర్గతమైంది. సీఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ఎటపాక మండలం నెల్లిపాకకు చెందిన మనోజ్‌కుమార్, గణేష్‌లు చింతూరు మండలం పేగ గ్రామం నుంచి కారులో టేకు దిమ్మెలను రవాణా చేస్తున్నారు. లచ్చిగూడెం, సరివెల మీదుగా ఘటనా స్థలానికి వచ్చేసరికి కారులో రెండు బాటిళ్లలో నిల్వ ఉంచిన పెట్రోల్ లీకయింది. ఈ విషయం గమనించకుండా కారును రహదారి పక్కకు నిలిపి ఓ వ్యక్తి సిగరెట్ వెలిగించగా లీకైన పెట్రోల్ అంటుకుని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో భయపడిన వారు కారును అక్కడే వదిలేసి పరారైనట్టు సీఐ తెలిపారు. దర్యాప్తులో భాగంగా సదరు కారు యజమానితో పాటు కలప రవాణా చేస్తున్న ఇద్దరిని పిలిచి ప్రశ్నించగా అసలు విషయం బయటపడనట్టు ఆయన తెలిపారు. కలప వ్యవహారంపై అటవీ అధికారులకు సమాచారమిచ్చినట్టు సీఐ తెలిపారు.

రైతు నేస్తం

విశిష్ట సేవల ఆర్‌ఏఆర్‌ఎస్

21 రకాల చెరకు, 15 రకాల వరి వంగడాల అభివృద్ధి

విభిన్నమైన విశిష్ట సేవలు అందిస్తూ అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) రైతుల పాలిట కల్పవృక్షంగా నిలుస్తోంది. ఇక్కడి శాస్త్రవేత్తల పరిశోధనలకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. అందుకే ఆర్‌ఏఆర్‌ఎస్‌ను జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వరించాయి. రైతుకు మేలు కలిగించే నూతన వంగడాల అభివృద్ధి, సేంద్రియ పంటలకు సరికొత్త విధానాలు, చెరకు నుంచి బెల్లం తయారీ, విదేశాల్లో ఆదరణ పెరిగేలా బెల్లం ఉత్పత్తుల తయారీ.. ఇలా చెప్పుకుంటూ పోతే పరిశోధన స్థానం ఘనతలు అన్నీ ఇన్నీ కావు. ఆర్‌ఏఆర్‌ఎస్‌ను అనకాపల్లిలో 1913లో స్థాపించారు. ఈనెల 13న 111వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.



సాక్షి, అనకాపల్లి: ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు తమ పరిశోధనలతో ఉత్తరాంధ్రలో వివిధ రకాల పంటల సాగును పరిపుష్టం చేశారు. 21 రకాల చెరకు, 15 రకాలకు పైగా నూతన వరి వంగడాలు అభివృద్ధి చేశారు. గత ఏడాదిలో సుమారు 155 టన్నుల వరకు మేలైన చెరకు వంగడాలను సృష్టించి స్థానిక రైతులకు, పంచదార కర్మాగారాలకు అందించారు. ఒడిశా, తమిళనాడులాంటి పొరుగు రాష్ట్రాలకు కూడా సరఫరా చేశారు. వీటిలో ప్రధానమైనవి మధు, విశ్వామిత్ర, శారద, విశాఖ, కనకమహాలక్ష్మి, ఉత్తర, రేవతి, సింహాద్రి ,శ్రీముఖి, వశిష్ట, నవీన్ వంటి వంగడాలు. ఇటీవలే చెరకులో మంచి రసనాణ్యత కలిగి ఎర్ర కుళ్లు, కాటుక తెగులు రాకుండా ఉండేలా.. మన ప్రాంతాలకు అనువుగా ఉండి, హెక్టారుకు 130 టన్నుల దిగుబడినిచ్చే 'అరుంధతి (2012ఏ 319)' అనే కొత్త వంగడాన్ని అభివృద్ధి చేశారు. 2006 ఏ223, 2010 ఏ 229 వంటి రకాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఇవే కాకుండా, వరి పంటలో 406 క్వింటాళ్ల ఫౌండేషన్ వరి విత్తనం 1,350 ఎకరాలకు సరిపడా సరఫరా చేయడం జరిగింది. రాగి పంటలో పోషకాహారాలు ఎక్కువగా ఉన్న 'ఇంద్రావతి' అనే మేలు రకం విత్తనాన్ని 27 క్వింటాళ్ల వరకు 676 ఎకరాలకు సరిపడా విత్తనాన్ని అభివృద్ధి చేసి రైతులకు అందజేశారు.

జీవన ఎరువుల తయారీ కేంద్రాలు

రైతుకు తక్కువ ఖర్చుతోపాటు అధిక దిగుబడిని కల్పించే విధంగా జీవన ఎరువుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పొడి, ద్రవ రూప జీవన ఎరువులు తయారీ కేంద్రాలను స్థాపించి గత ఐదేళ్లగా సుమారు 40,650 కిలోల పొడి జీవన ఎరువులు, 27,500 లీటర్ల ద్రవ రూప జీవన ఎరువులను తయారుచేసి రాష్ట్ర వ్యాప్తంగా 75 వేల ఎకరాలకు అందించారు. వీటితో పాటుగా కీటక శాస్త్ర విభాగంలో జీవ నియంత్రణ పద్ధతులపై విస్తత పరిశోధనలు జరపడం, మొక్కజొన్నలో కత్తెర పురుగును ఈ ప్రాంతంలో మొదటి సారిగా గుర్తించడం, కొబ్బరిలో సర్పిలాకార తెల్ల దోమ పురుగు గుర్తించి నియంత్రణ విధానాలు, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా ప్రాచుర్యంలోకి తీసుకురావడం శాస్త్రవేత్తల అంకిత భావానికి నిదర్శనం.



ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయం

నవీన బెల్లం ప్లాంట్ ఏర్పాటు

బెల్లం తయారీలో హైడ్రోస్‌ను వాడకుండా సేంద్రియ పద్ధతిలో తయారు చేసి.. బెల్లం నాణ్యతను పెంచడంపై పరిశోధన చెప్పుకోదగ్గది. బెల్లాన్ని నాణ్యమైన పరిస్థితులలో తయారు చేసే నవీన బెల్లం ప్లాంటును అనకాపల్లి పరిశోధన స్థానంలో 2021లో ఆవిష్కరించారు. ఈ పద్ధతిలో రోజుకు టన్ను బెల్లాన్ని లేదా 1500 లీటర్ల బెల్లం పాకాన్ని లేదా 800 కిలోల బెల్లం పొడిని తయారు చేయవచ్చు.

నాలుగు దేశీయ పేటెంట్లు..

దేశంలో అత్యుత్తమ 4 పేటెంట్లను ఆర్‌ఏఆర్‌ఎస్ సాధించింది. ఉప్పుడు బియ్యం ప్రాసెసింగ్, బెల్లం పొడి, బెల్లంపొడి తయారీ, బెల్లం పూతరేకులు యంత్రం తయారీలో పేటెంట్ పొందారు. ఇది వ్యవసాయ విశ్వవిద్యాలయానికే కాకుండా రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది. విద్యుత్ సహాయంతో పనిచేసే పూత రేకుల తయారీ యంత్రాన్ని రూపొందించారు. దీనికి 'డిజైన్ పేటెంట్' 2022లోనే లభించింది. వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసే 'ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్' ను నెలకొల్పారు. మినీ రైస్ మిల్, మినీ పిండిమర, మినీ పప్పు మిల్లు, రాగి పొట్టు తీయు యంత్రం, మినీ ఆయిల్ మిల్లు, కోటింగ్ యంత్రాలు ఆవిష్కరించి వాటిపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు. ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకం ద్వారా రూ.1.37 కోట్లతో ఇంక్యుబేషన్ సెంటర్ స్థాపించారు. చెరకు ప్రాసెసింగ్ లైన్లు, చిరుధాన్యాల ప్రాసెసింగ్ లైన్లు, పనస ప్రాసెసింగ్ లైన్లు వంటివి ఎగుమతి చేస్తున్నారు.

పూతరేకుల యంత్రం తయారీ..



ఆత్రేయపురంలో ప్రయోగాత్మకంగా ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు రూపొందించిన పూతరేకుల తయారీ మెషీన్‌కు అనుమతులు వచ్చాయి. సాధారణంగా పూతరేకులు రోజుకు 650 వరకు చేయగల్గితే ఆర్‌ఏఆర్‌ఎస్ సాంకేతికతలో 1200 వరకూ చేయవచ్చు. దీనిని 2016లో రూపొందించారు. ఈ యంత్రం ఖరీదు రూ.35 వేల వరకు ఉంటుంది. తాజాగా చిరుధాన్యాలపై వినూత్న పరిశోధనలు చేస్తున్నారు. జనసామాన్యానికి మిల్లెట్స్ దగ్గర చేసే ప్రయత్నం చేస్తున్నారు.

అవార్డుల పంట

ఆర్‌ఏఆర్‌ఎస్‌కు జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వచ్చాయి. సాంకేతిక విభాగంలో 2020–21, 2023–24 సంవత్సరాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ కేంద్రంగా అవార్డు వచ్చింది. అఖిల భారత్ జీవ నియంత్రణ విభాగంలో 2019–20లో 'ఏ' గ్రేడ్ సెంటర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. పలువురు శాస్త్రవేత్తలు తమ పరిశోధనలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. వ్యవసాయ అధికారులకు, 6000 మంది రైతులకు సుమారు 18 వాట్సాప్ గ్రూపుల ద్వారా వాతావరణ సమాచారాన్ని అందిస్తున్నారు.

రేపు కిసాన్ మేళా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈనెల 13న 65వ కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏడీఆర్ సిహెచ్.ముకుందరావు చెప్పారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిసాన్ మేళాలో ఉత్తర కోస్తా జిల్లాలైన విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. వరి, చెరకు, చిరుధాన్యాల రైతులకు ఆర్‌ఏఆర్‌ఎస్‌లో శిక్షణ అందించి, వరి, చెరకు, చిరుధాన్యాల పంటలో వాతావరణానికి అనుగుణంగా వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రైతులకు చెరకు మీద ఆసక్తి తగ్గిందని, ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పి.వి.కె.జగన్నాథరావు, ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు, రమణమూర్తి, ఆర్.సరిత తదితరులు పాల్గొన్నారు.

బాపనమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు


పూజల అనంతరం గ్రామస్తులతో ఎమ్మెల్సీ అనంతబాబు

గంగవరం: మండలంలోని సూరంపాలెం గ్రామపంచాయతీ దోనెలపల్లిలో బాపనమ్మ అమ్మవారికి ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ (బాబు) ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం జరిగిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కుంకుమ పూజలు చేశారు. సూరంపాలెం సర్పంచ్ బల్లెం శివదొర ఆధ్వర్యంలో దోనెలపల్లి గ్రామస్తులు ఆయన ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ సీహెచ్.రఘునాథ్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవాని భక్తులు ఎమ్మెల్సీ అనంత బాబును సత్కరించారు.

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశం


రాజవొమ్మంగి పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

రాజవొమ్మంగి: రోగుల అవసరాల మేరకు వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశించారు. బుధవారం ఆయన రాజవొమ్మంగి, జడ్డంగి పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు పరిశీలించారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బర్త్ వెయిటింగ్ రూం, వార్డుల్లోని గర్భిణుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లా మొత్తంమ్మీద 1, 99, 270 మందికి సికిల్ సెల్ నిర్ధారణ రక్త పరీక్షలు చేయగా ఈ సమస్యతో ఉన్న 12, 679 మందిని గుర్తించినట్టు తెలిపారు. వీరిలో 11,720 సికిల్‌సెల్ ఎనీమియాతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వీరికి అవసరమైన వైద్యసేవలు, మందులు, ఇతర సదుపాయాలు అందేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. స్కూల్ పిల్లలకు ఆర్‌బీఎస్‌ఏ కార్డుల జారీ ప్రక్రియ జిల్లాలో దాదాపు పూర్తయిందన్నారు.వైద్యాధికారులు సుష్మ, నాగార్జున పాల్గొన్నారు.

బెంగళూరు-హౌరా మధ్య వన్ వే స్పెషల్

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా(08565) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఎస్ఎంవీ బెంగళూరులో ఈ నెల 14వ తేదీన (శనివారం) ఉదయం 10.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.03 గంటలకు దువ్వాడకు, ఆదివారం రాత్రి 9.45 గంటలకు హౌరా చేరుకుంటుంది. స్పెషల్ రైలు జాలర్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్‌లలో ఆగుతుంది.

పలు రైళ్ల రద్దు

సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖపట్నం–రాయ్‌పూర్ (08528) పాసింజర్ స్పెషల్ జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు, రాయ్‌పూర్–విశాఖపట్నం(08527) పాసింజర్ స్పెషల్ జనవరి 3 నుంచి 9వ తేదీ వరకు, విశాఖపట్నం–భవానిపట్నం(08504) పాసింజర్ స్పెషల్ జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు, భవానిపట్నం–విశాఖపట్నం(08503) పాసింజర్ స్పెషల్ జనవరి 4 నుంచి 9వ తేదీ వరకు, విశాఖపట్నం–దుర్గ్ (18530) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు, దుర్గ్–విశాఖపట్నం(18529) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు రద్దయినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఆదివాసీల దీక్షలు


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆదివాసీలు

ఎటపాక: ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఉద్యోగ భద్రత చట్టం చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా పరిషత్ నాయకులు వెంకటేష్, దుర్గారెడ్డి మాట్లాడుతూ గిరిజనేతరుల బోధన వల్ల ఆదివాసీలు విద్యకు దూరం అవుతున్నారని, అందువల్ల ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. జీవో నంబర్ 3 రద్దును పునఃపరిశీలించి ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుమారి, శ్యామలత, వెంకటేష్, రవి పాల్గొన్నారు.

కాఫీ కొనుగోళ్లు ప్రారంభం

- తొలిరోజు 190 కిలోల పార్చ్‌మెంట్ గింజల సేకరణ

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కాఫీ గింజల కొనుగోళ్లను జీసీసీ బుధవారం ప్రారంభించింది. మండలంలోని దొడ్డిపల్లిలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, జీసీసీ బ్రాంచి మేనేజర్ బుక్కా సింహచలం గిరిజన రైతుల నుంచి 190 కిలోల పార్చ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.285 ధరకు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, జీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి


నగేష్ మృతదేహం

ఎటపాక: మండలంలోని నల్లకుంట గ్రామంలో గుండి నగేష్ (56) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ కలహాల కారణంగా మంగళవారం పురుగుల మందు తాగినట్టు తెలిసింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే నగేష్ ఆరోగ్య పరిస్థితి విషమించి అర్ధరాత్రి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎస్ఐ పార్థసారధి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు అభినందనలు

నాతవరం: అనంతపురం జిల్లా నార్పల్ నేతాజీ హైస్కూల్‌లో ఈనెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగిన 43వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు సత్తాచాటి బంగారు పతకం సాధించింది. మండలంలోని మర్రిపాలెం గ్రామానికి చెందిన యాదిగిరి ప్రణతిప్రశాంతి టీమ్ లీడర్‌గా వ్యవహరించారు. ప్రణతి ప్రశాంతితో పాటు చినగుమ్ములూరికి చెందిన యామిని, పి.స్వాతికి కూడా ప్రతిభ చూపారు. రాష్ట్రజట్టు బంగారు పతకం సాధించిందని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు. క్రీడాకారులకు పలువురు అభినందనలు తెలిపారు.

అధికారం ముసుగులో టేకు ఫర్నిచర్ తరలింపు


- అడ్డుకున్న గిరిజన నాయకులు



మినీ లారీని అడ్డుకున్న గిరిజన నాయకులు, గ్రామస్తులు


మినీ వ్యానులో ఉన్న టేకు ఫర్నిచర్

ఎటపాక: అటవీశాఖలో పనిచేసి బదిలీ అయిన ఓ అధికారి టేకు ఫర్నిచర్‌ను లారీలో తరలిస్తుండగా గిరిజన, స్థానిక బీజేపీ నాయకులు మండలంలో నందిగామ గ్రామంలో బుధవారం రాత్రి అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కూనవరం అటవీశాఖ రేంజర్‌గా విజయలక్ష్మి పనిచేసి ఇటీవల బదిలీపై ఏలూరు వెళ్లారు. ఇక్కడ పనిచేసే సమయంలో కూనవరం మండలం కోతులగుట్టలో నివాసం ఉండేవారు. బదిలీ నేపథ్యంలో ఇంట్లోని సామగ్రిని ఏలూరు తీసుకెళ్లే క్రమంలో టేకుతో తయారు చేయించిన సోఫాసెట్, డైనింగ్ టేబుల్, మంచాలు, కుర్చీలతో పాటు టేకు చెక్కలను కూడా తరలిస్తున్నారు. సమాచారం తెలిసిన బీజేపీ నాయకులు పాయం వెంకయ్య, మరి కొందరు గిరిజన నాయకులు లారీని వెంబడించి నందిగామ గ్రామంలో అడ్డగించారు. లారీలో టేకు సామగ్రి తరలింపును వ్యతిరేకించారు. ఇల్లు మారుతున్న సమయంలో సామగ్రి తరలించేందుకు గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాలని, అటవీశాఖ అధికారి కావడంతోనే చెక్‌పోస్టులను మేనేజ్ చేస్తూ సామగ్రి తరలిస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పటికే రెండు లారీల్లో సామగ్రి తరలించారంటూ ఆరోపించారు. దీనిపై అటవీ శాఖ అధికారులు విచారణ జరపాలని పట్టుబడుతూ లారీని రహదారిపైనే నిలిపేశారు. కనీసం రైతులకు అవసరమైన కలపను కూడా అడవి నుంచి తెచ్చుకోనీయకుండా అడ్డుకుని, కేసులు పెట్టించిన ఆమె అక్రమంగా ఇంత కలపను ఎలా తరలిస్తారని ప్రశ్నించారు.

అక్రమ డిప్యూటేషన్లపై యూటీఎఫ్ నిరసన


ఐటీడీఏ ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు


చింతూరులో నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులను, సీఆర్‌టీలను సుదూర ప్రాంతాలకు డిప్యూటేషన్ వేయడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక్కడ ప్రాంతానికి చెందిన వారిని అనంతపురం, నెల్లూరు, కృష్ణ, గుంటూరు జిల్లాలకు అక్రమ డిప్యూటేషన్‌లు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణం అక్రమ డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె కృష్ణ డిమాండ్ చేశారు. డిప్యూటేషన్‌లు వేసిన వారిలో గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్న వారు ఉన్నారని , కనీసం ఏమీ పట్టించుకోలేదన్నారు. విల్సన్‌బాబు, విశ్వరాజ్, ఆదిరెడ్డి, సూరిబాబు, వెంకటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: ఉపాధ్యాయులు, సీఆర్టీల అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం చింతూరులో దీనిపై యూటీఎఫ్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయులు, సీఆర్టీలను డిప్యుటేషన్ పేరుతో సదూర ప్రాంతాలకు బదిలీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గురుకుల పాఠశాలలకు చెందిన ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లో విధులు నిర్వహిస్తున్న 230 మంది ఉపాధ్యాయుల నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు పంపిన డిప్యుటేషన్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. వెంకటనారాయణ, కిష్టయ్య, కవిత, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, జడ్డంగి పోలీసుస్టేషన్ల సందర్శన


రికార్డులను పరిశీలిస్తున్న రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్

రాజవొమ్మంగి : రంపచోడవరం డీఎస్పీ సాయిప్రసాంత్ బుధవారం రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. స్టేషన్లలో పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐలు నర్సింహమూర్తి, చిన్నబాబును ఆదేశించారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించిన అనంతరం భద్రతా పరమైన పలు అంశాలపై చర్చించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్మారకకేంద్రమైన రాజవొమ్మంగి పాత పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అల్లూరి చరిత్రకు చెందిన తైలవర్ణ చిత్రాలను తిలకించారు. ఇక్కడ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. లోతట్టు గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని, ఆదివాసీలతో స్నేహభావంతో మెలగాలని సూచించారు.